7

సాక్షి కుమురం భీం

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025

గంగమ్మ ఒడికి గణనాథుడు

జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి గణనాథుడి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. పురవీధుల గుండా ఊరేగిస్తూ వాగుల్లో నిమజ్జనం చేశారు. అలాగే మండపాల వద్ద కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- వివరాలు 9లో▸



న్యూస్‌రీల్

స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లాలోని ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులో స్టెనోగ్రాఫర్ గ్రేడ్– 11 పోస్టుల భర్తీకి పదవీ విరమణ పొందిన జ్యుడిషియల్ ఉద్యోగులతోపాటు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న సాయంత్రం 5 గంటలలోగా పోస్ట్ కొరియర్ ద్వారా సీల్డ్ కవర్‌లో దరఖాస్తు పంపించాలని.. నేరుగా, వ్యక్తుల ద్వారా ఇచ్చే దరఖాస్తులు తీసుకోమని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందిన జ్యుడిషియర్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఉంటుందని, అభ్యర్థులు 65 ఏళ్లు నిండి నిబంధనల ప్రకారం అర్హత ఉండాలని సూచించారు. పదవీ విరమణ పొందిన అభ్యర్థులు లేనిపక్షంలో ఇతరులకు అవకాశం కల్పిస్తామన్నారు. జూలై 1 2025 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలని, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని, షార్ట్ హ్యాండ్ హయ్యర్ గ్రేడ్, ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు లేనిపక్షంలో లోయర్ గ్రేడ్ షార్ట్ హ్యాండ్‌కు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

7న బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 7న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్– 14 బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఈ నెల 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనురులో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఇదే నెల 25 నుంచి 29 వరకు చెన్నైలోని దిండిగల్‌లో జరిగే జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 7న ఆధార్ కార్డు, బోనోఫైడ్ ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు మారిన వెంకటేశ్వర్లు 98666 52249, కుమ్మరి మల్లేశ్ 90321 26050ను సంప్రదించి రిపోర్టు చేయాలని కోరారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి కళోత్సవ్



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 15 మండలాల నుంచి 12 కళారూపాల్లో సుమారు 300 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచి ఒక కళను అలవాటు చేసుకుని సాధన చేయాలన్నారు. చదువుతో పాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే కళోత్సవ్ పోటీల్లో జిల్లా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఎంఈవో రాథోడ్ సుభాష్, హెచ్‌ఎం జనార్దన్, న్యాయ నిర్ణేతలు కిల్లి వెంకట్రావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, రాజనర్సు బాబు, శ్రీనాథ్, పద్మ, శ్రీలత, సురేశ్, శేఖర్, శంకర్, వివిధ పాఠశాలల గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు గ్రామ పాలనాధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో 59 మంది గ్రామపరిపాలనాధికారులు నియామకం కానున్నారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్డరు కాపీలు అందుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అర్హత పరీక్షలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు గ్రామ పాలనాధికారులుగా ఎంపికయ్యారు. వీరి నియామకంతో రెవెన్యూ శాఖలో సేవలు మెరుగుపడే అవకాశం ఉంది. ఎంపికైన వారిలో శుక్రవారం ఉదయం 51 మందిని జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తరలించనున్నారు.

గురుభ్యోనమః

అక్షరాన్ని నేర్పే గురువు జీవితానికి మార్గాన్ని చూపిస్తారు. అలాంటి టీచర్ ప్రతిఒక్కరి జీవితంలో ఒకరు ఉంటారు. క్రమశిక్షణ నేర్పించి.. జ్ఞానజ్యోతులు వెలిగించి భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తారు. రేపటి పౌరులను తీర్చిదిద్దే గురువుల సేవలకు గుర్తుగా ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తారు. నేడు మాజీ రాష్ట్రపతి, ఉపాధ్యాయుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసి, బోధనలో ఉత్తమంగా నిలుస్తున్న ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.



మరిన్ని కథనాలు 8లో▸

బోధనలో వైవిధ్యం



టీఎల్‌ఎం ద్వారా బోధిస్తున్న నందిని

కెరమెరి: మండలంలోని మారుమూల గ్రామమైన ఉమ్రి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నందిని బోధనలో వైవిధ్యం చూపుతున్నారు. 'మన ఇల్లు–మన పఠనాలయం' పేరుతో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నవోదయ విద్యాలయాలు, గురుకులాలు, ఇతర కార్పొరేట్ విద్యాలయాల్లో ఉచిత ప్రవేశం కోసం ఐదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంగ్లిష్ గ్రామర్, జీకే, ఇతర అంశాలు సులువుగా అర్థమయ్యేలా బోధించేందుకు టీఎల్‌ఎంలు వినియోగిస్తున్నారు. ఏక పాత్రాభినయం, నాటకీకరణ ద్వారా ఆకట్టుకుంటున్నారు. గ్రామంలోని మహిళలకు మన ఆరోగ్యం పేరుతో ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇంటింటికీ తిరిగి.. ప్రవేశాలు పెంచి

కెరమెరి: మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో ప్రవేశాలు పెంచడంలో ఉపాధ్యాయుడు రవితేజ ఎనలేని కృషి చేశారు. కుటుంబ సమగ్ర సర్వేలో భాగంగా ఇంటింటికీ తిరిగారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని అర్థం చేసుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. సొంత ఖర్చుతో కరపత్రాలు ముద్రించి బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రచారం చేశారు. గతేడాది 40 వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 73కు చేరింది. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు సైతం ప్రారంభించారు. గ్రామస్తుల సహకారంతో తెలుగు నుంచి ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి తీసుకురావడంతో గోయగాం పాఠశాల ప్రైవేట్‌కు దీటుగా కొనసాగుతోంది.



ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు

సృజనాత్మకతకు కేరాఫ్



డాక్టరేట్‌తో ఉపాధ్యాయుడు రాజేశ్

వాంకిడి: సృజనాత్మకతతో బోధిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుతున్నారు వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేశ్. ప్రస్తుతం ఆయన ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంట సాగు విధానంపై మొక్కల ఎదుగుదల, చీడపీడల వృద్ధి తదితర వివరాలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మన్ననలు అందుకుంటున్నారు. సృజనాత్మకతతో విద్యనందిస్తున్న ఆయనకు హర్యానాలోని ఫరిదాబాద్ యూనివర్సిటీకి చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డు అందించింది. రాష్ట్రస్థాయిలో టీచర్స్ బెస్ట్ ప్రాక్టిసెస్‌లో ఎంపికై ప్రతిభ చూపారు. జిల్లా, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పలుమార్లు ఎంపికయ్యారు. 2024లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. 2024లో హైదరాబాద్‌లో నిర్వహించిన సైన్స్ డ్రామాలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. పిల్లలకు సృజనాత్మకతతో బోధిస్తే అంశాలపై పట్టు సాధించి, ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఉపాధ్యాయుడు రాజేశ్ చెబుతున్నారు.

వంట తంటాకు చెల్లు!

- ఇక నుంచి గ్రీన్ చానల్ ద్వారా నిర్వాహకులకు బిల్లులు
- పెండింగ్ లేకుండా నెలనెలా అందించేందుకు ప్రభుత్వ నిర్ణయం



ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో వంట చేస్తున్న కార్మికురాలు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకుల తంటాలు ఇక తీరనున్నాయి. ప్రతినెలా బిల్లులను ప్రభుత్వం గ్రీన్ చానల్ ద్వారా చెల్లించనుంది. ప్రస్తుతం జిల్లాలో 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి ఐదు నెలల వంట బిల్లులు, ఆరు కోడిగుడ్డు బిల్లులు, మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం వారికి ఊరట కలిగించనుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 994 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో గిరిజన పాఠశాలలు 262, ప్రభుత్వ లోకల్ బాడి పాఠశాలలు 732 ఉన్నాయి. ఆయా స్కూళ్లలో సుమారు 45 వేల మందికి ప్రతీరోజు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వారికి ఒక్కొక్కరికి రూ.6.19, ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వారికి రూ.9.29, తొమ్మిది, పదో తరగతి వారికి రూ.10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. అదనంగా కోడిగుడ్డుకు రూ.6, గౌరవ వేతనం కింద నిర్వాహకులకు రూ.మూడు వేలు చెల్లిస్తున్నారు. వంట బిల్లుల్లో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్రం ప్రభుత్వం 60శాతం భరిస్తోంది. అయితే ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వారికి మధ్యాహ్న భోజనం బిల్లులు ప్రభుత్వం సక్రమంగానే జమ చేస్తోంది. 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన బిల్లులు మాత్రం నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి.

చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

ప్రస్తుతం ఉన్న బిల్లుల చెల్లింపుల విధానంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గౌరవ వేతనాలు, బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అప్పులు చేసి వంట చేయాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, వంట నూనె, ఇతర నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో ప్రభుత్వం చెల్లించే బిల్లులు సరిపోవడం లేదని చెబుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనం రూ.10 వేలు చెల్లించాలని కోరుతున్నారు.

గ్రీన్ చానల్ విధానం అయితే..

గ్రీన్ చానల్ విధానం అయితే మధ్యాహ్న భోజన బిల్లులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతినెలా ఆన్‌లైన్ యాప్ ద్వారా నేరుగా ఖాతాలో జమ చేస్తారు. ఏడాది మొత్తానికి అవసరమైన బిల్లులకు నిధులు కేటాయిస్తారు. నిధులకు ఇబ్బందులు లేకుండా ఖాతాల్లో జమ చేస్తారు. విద్యాశాఖ ప్రస్తుతం మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వివరాల నమోదు కోసం యాప్ రూపొందించింది. ప్రస్తుతం అందులో వివరాలు నమోదు చేస్తున్నారు. గ్రీన్ చానల్ విధానం అమల్లోకి వస్తే ప్రతినెలా ఏ పాఠశాలలో.. ఎంత మంది కార్మికులకు ఎంత బిల్లు చెల్లించాలనే విషయం స్పష్టం తెలుస్తుంది. ప్రధానోపాధ్యాయుడు ఆమోదం తెలిపిన తర్వాత, ఎంఈవో సరిచూసుకుని ఆమోదిస్తే ట్రెజరీ శాఖ ప్రతినెలా నిర్వాహకుల ఖాతాల్లో నగదు జమ చేస్తుంది.

పెండింగ్ ఉంచొద్దు



కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజనం బిల్లు రాలేదు. ప్రభుత్వం ఇకపై బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉంచొద్దు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనం రూ.10 వేలు చెల్లించాలి. పాఠశాలల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

– కమల, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, మోతుగూడ

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు చెల్లిస్తామని నిర్ణయించడం హర్షణీయం. పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలి. గత ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేసిన అల్పాహారానికి సంబంధించి బిల్లులు నేటివరకు రాలేదు. అవి త్వరగా చెల్లించాలి. నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు సవరించాలి.

– కృష్ణమాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైనవిద్యతోపాటు రుచికరమైన పోషకాహారం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు పరిశీలించారు. వంట మనుషులతో మాట్లాడి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న మెనూ వివరాలు తెలుసుకున్నారు. వంట చేసే సమయంలో పరిశుభ్రత పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర వస్తువులు వినియోగించాలని సూచించారు. శుద్ధమైన తాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయుల స్థానంలో బోధించిన తీరును పరిశీలించారు. గణితం ప్రశ్నలు వేసి అభ్యసన సామర్థ్యాలు తెలుసుకున్నారు. పదో తరగతి ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



విద్యార్థినులతో పుస్తకం చదివిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని జెండాగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అంకుసాపూర్ పాఠశాలను సందర్శించారు.

హాజరుపై ప్రతిరోజూ సమీక్షించాలి

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపై ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ సమీక్షించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం దహెగాం, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి మండలాల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటలలోగా విద్యార్థుల హాజరుపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షించాలన్నారు. 50 శాతం విద్యార్థులు గైర్హాజరవుతున్నారని, దీనిపై తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సైతం ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కావొద్దన్నారు. సమావేశంలో పాఠశాలల సమన్వయకర్త అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



పెద్దవాగు ప్రాంతంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద గణేశ్ నిమజ్జన ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా గణేశ్ నిమజ్జన ఉత్సవాలను అన్నిశాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. నిమజ్జన ఘాట్ల వద్ద ట్రాఫిక్, ఇతర డ్యూటీల కోసం 600 మంది పోలీసులను బందోబస్తు కోసం నియమించామన్నారు. సీసీ కెమెరాలు, బోట్లు, డీడీఆర్‌ఎఫ్ బృందం, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. మద్యం తాగి వేడుకల్లో పాల్గొనవద్దన్నారు. మండపాల నిర్వాహకులు, భక్తులు విద్యుత్‌పై ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను తక్షణమే సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట సీఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సై ఉదయ్‌కిరణ్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ వాసుదేవ్‌కు వినతిపత్రం అందించారు. ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో సుమారు 4 నుంచి 6 నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జీవితబీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పిస్తామని ప్రభుత్వం మెమో జారీ చేసి డీపీవోలకు పంపించినా నేటికి అనేక జిల్లాల్లో అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్మికులకు రూ.19వేల వేతనం చెల్లించాలని, అప్పటిలోగా జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 51ని సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేశ్, దేవాజీ, వెంకటేశ్, శ్రీనివాస్, శంకర్, సత్తయ్య, అన్నాజీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన పెన్‌గంగ వరద



వెంకట్రావ్‌పేట్- పోడ్సా అంతర్రాష్ట్ర వంతెన వద్ద నది వరద

సిర్పూర్(టి): పెన్‌గంగలో వరద ఉధృతి గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టింది. సిర్పూర్(టి) మండలం హుడ్కిలి సమీపంలోని వంతెన వద్ద వరద తగ్గడంతో హుడ్కిలి, జక్కాపూర్, మాకిడితోపాటు మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. వెంకట్రావ్‌పేట్– పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని పెన్‌గంగ నదిపై ఉన్న వంతెన వద్ద వరద తగ్గడంతో రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ రహీముద్దీన్, ఎస్సై కమలాకర్ పెన్‌గంగ నది వరద ఉధృతిని పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025– 26 విద్యాసంవత్సరానికి అతిథి అధ్యాపకుడి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కనకయ్య తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్ట్ బోధించేందుకు పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం, ఇతరులు 55 శాతం మార్కులు కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 9 సాయంత్రం 4 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



కన్యకాపరమేశ్వరి దేవాలయం సమీపంలో స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ స్తంభాలు, తీగలు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందంటూ 'మేలుకోకుంటే కాటేస్తయ్' అనే శీర్షికతో ఆగస్టు 22న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం పట్టణంలోని ఇందిరా మార్కెట్ ఏరియాలోని కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి పొట్టి శ్రీరాములు చౌరస్తా వరకు, అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. వినాయక చవితి పండుగ సందర్భంగా వంగి ఉన్న స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని పలుమార్లు 'సాక్షి'లో వార్తలు ప్రచురితం కావడంతో నూతన స్తంభాలు ఏర్పాటు చేశారు. అలాగే వినాయక నిమజ్జన శోభాయాత్ర రోజు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన 12 మంది సిబ్బందికి విధులు కేటాయించామని ఏఈ కమలాకర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): నిర్మల్‌లోని దివ్యగార్డెన్స్‌లో నిర్వహించే 6వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు గురువారం తరలివెళ్లారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏదు కొండలు గురువారం రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారుల జాబితా విడుదల చేసి, ఎంపికైన వారిని ఆసిఫాబాద్ నుంచి నిర్మల్‌కు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరో తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్స్, జూనియర్ చాంపియన్‌షిప్ శుక్రవారం నుంచి ఈ నెల 7 వరకు జరగనున్నాయని తెలిపారు. జిల్లా క్రీడాకారులు ప్రతిభచూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు బాలుర విభాగంలో ట్రెడిషనల్ యోగాలో మనన్‌బార్, ఫార్వర్డ్ బెండ్ చిత్యాల శ్రీయాన్, ట్విస్టింగ్ యోగా శ్రీయాన్ గౌడ్, బ్యాక్‌వర్డ్ బెండ్ యోగా బొసెల్లి ప్రతిక్, లెగ్ బ్యాలెన్స్ బట్టి అకిల్‌సింగ్, హ్యాండ్ బ్యాలెన్స్ నాగ చైతన్య, సుపిన్‌పోజ్ చిట్యాల శ్రీయాన్, ఆర్టిస్టిక్ సింగల్ అశ్విత్ యాదవ్, ఆర్టిస్టిక్ డబుల్ ఆదర్శ్, సాయి రోహిత్, రిథమిక్ ఫేర్ అశ్విత్, త్రినాథ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ట్రెడిషనల్ యోగాలో సాయి ప్రణీత, ఫార్వర్డ్ బెండ్ రసకట్ల స్లోక, ట్విస్టింగ్ వనపర్తి అఖిల, ఆర్టిస్టిక్ సింగల్ కుమ్మరి శ్రీవల్లి ఎంపికయ్యారు.



మాస్టార్లు

- పిల్లలను తీర్చిదిద్దుతున్న టీచర్లు
- వారి ఉన్నతికి, బడి బాగుకు కృషి
- ఆటబొమ్మలతో విద్యాబోధన
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

విద్యార్థి భవిష్యత్తు పాఠశాలలోనే రూపుదిద్దుకుంటుంది. డాక్టర్ అయినా, సైంటిస్ట్ అయినా, పొలిటీషియన్ అయినా, రచయిత అయినా, రాజకీయ నాయకుడు అయినా గురువు శిష్యులే.. మంచి ఉపాధ్యాయుడు చెక్కిన విద్యార్థి భవిష్యత్ ఉన్నతంగా ఉంటుంది. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది గురువు. పాఠశాల బాగుకు, విద్యార్థుల ఉన్నతికి, బడిమానేసిన వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేస్తున్నారు. చదువులో వెనుకబడినవారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. పాఠాలు సులువు అర్థమయ్యేలా గోడలపై రంగురంగుల బొమ్మలు గీస్తూ బోధన చేస్తున్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రాణం పోస్తున్న కొంత మంది ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం.

బడిని బతికించాడు


పాఠం బోధిస్తున్న హెచ్‌ఎం శివప్రసాద్

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది విద్యార్థుల సంఖ్య 5 ఉండేది. బడి మూతపడకుండా ఎలాగైనా బతికించుకోవాలనే ఉద్దేశంతో హెచ్‌ఎం శివప్రసాద్ వేసవి సెలవుల్లో ఇంటింటా తిరి గాడు. మీ పిల్లలను ప్రైవేటుకు పంపద్దు, ప్ర భుత్వ బడికే పంపాలని తల్లిదండ్రులను కో రాడు. బడి పునఃప్రారంభమైన తర్వాత విద్యార్థుల ఇళ్లకు మరోసారి వెళ్లాడు. కొత్త అడ్మిషన్లలో భాగంగా విద్యార్థుల సంఖ్యను 38కి చేర్చాడు. మూతబడే బడిని హెచ్‌ఎం చొరవతో బతికించి ఆదర్శంగా నిలిచాడు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్ తదిర విద్యాసామగ్రిని హెచ్‌ఎం అందిస్తు విద్యార్థులకు సహకరిస్తున్నాడు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి..



కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని జీడిచేను ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం పుల్లూరి బాలకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రెండేళ్లుగా కృషిచేస్తున్నాడు. 20 నుంచి 53 మందిని సంఖ్య పెంచారు. పాఠశాల అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి గ్రామస్తుల సహకారంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. టీచింగ్ లెర్నింగ్ విధానంలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ వంటి విషయాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాడు. పిల్లలు బడికి ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా వంద శాతం హాజరైన వారికి బహుమతులు అందజేస్తూ డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నాడు. – పుల్లూరి బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, జీడిచేను, ఎంపీపీఎస్

వినూత్న రీతిలో విద్యాబోధన


టీఎల్‌ఎం ద్వారా విద్యాబోధన చేస్తున్న శ్రీనివాస్

జన్నారం: అక్కపెల్లిగూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జాజల శ్రీనివాస్ వినూత్న రీతిలో బోధన చేస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నాడు. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేసేందుకు టీఎల్‌ఎం, ఉదాహరణలు వాడుతున్నాడు. నాలుగేళ్ల క్రితం శ్రీనివాస్ పొనకల్‌లో హెచ్‌ఎంగా పని చేసే సమయంలో 30 మంది విద్యార్థుల సంఖ్య ఉండేది. గురుకుల, నవోదయ కోచింగ్‌లు ఇస్తూ అనేక మందిని గురుకుల పాఠశాలల్లో చేరేదుకు కృషి చేయగా దీంతో సంఖ్య 200కు పెరిగింది. గతేడాది అక్కపెల్లిగూడ పాఠశాలకు హెచ్‌ఎంగా బదిలీ అయ్యాడు. అయితే టీచర్ వెంటే మేము అన్నట్లు 180 మంది విద్యార్థులు తిరిగి అక్కపెల్లి గూడ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం పాఠశాలలో 314 మంది సంఖ్య ఉంది. శ్రీనివాస్ రెండుసార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

సైన్స్‌పై మక్కువ పెంచేలా..



కాగజ్‌నగర్ కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో సైన్స్‌పై మక్కువ పెంచేందుకు ఫిజిక్స్ ఉపాధ్యాయులు ప్రసన్న వినూత్న రీతిలో బోధన చేస్తోంది. జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో వారిని పాల్గొనేలా కృషి చేస్తున్నారు. మూడేళ్లుగా ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 2023లో హర్యాణలోని ఫరీదాబాద్‌లో నిర్వహించిన ఇండియన్ ఇటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టుకు బోధన!


విద్యార్థులకు బోధిస్తున్న టీచర్ సాంబయ్య

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల బలహీనతలు అధిగమించడానికి, ప్రతిభ పెంచడానికి స్థానిక చెన్నూర్ రోడ్ పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సాంబయ్య ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. గ్రామీణప్రాంతానికి చెందిన దాదాపు 150 మందికిపైగా బీసీ సమీకృత వసతిగృహంలో ఉంటూ చెన్నూర్ రోడ్ పాఠశాలలో చదువుకుంటున్నారు. తెలుగు మీడియం విద్యార్థులు కావడం.. ఆంగ్లంపై ప్రావీణ్యం లేకపోవడంతో చదువుల్లో తడబడ్డారు. ఉపాధ్యాయుడు పాఠశాల సమయం ముగియగానే వసతిగృహంలో తరగతులు బోధిస్తూ వస్తున్నాడు. ఉదయం ప్రత్యేక తరగతులతో ఆంగ్లంలో మెలకువలు నేర్పిస్తున్నాడు.

విద్యార్థులతో ప్రయోగాలు



విద్యార్థులను ప్రయోగాల వైపు దృష్టి సారించేలా ప్రొత్సహిస్తున్నా. ప్రతీ ఏటా ఇన్‌స్పైర్ మనక్, నేషనల్‌చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్, బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులను భాగస్వాములు చేయిస్తాను. జిల్లా, రాష్ట్ర స్థాయిలో 10 మంది విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారు. వ్యక్తిగత విభాగాలలో టీచర్ నూతన బోధనోపకరణాల తయారీలో 2022లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, కేరళలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొని బహుమతి సాధించాను.
– మామిడాల తిరుపతయ్య, జెడ్పీఎస్ఎస్ పెట్రోల్‌పంప్, కాగజ్‌నగర్

డ్రాపౌట్ తగ్గింది.. హాజరుశాతం పెరిగింది

భీమిని: ప్రైవేటుకు దీటుగా కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించారు హెచ్‌ఎం అంకతి తిరుపతి, ఉపాధ్యాయురాలు రాథోడ్ సంగీత. పాఠశాలలో 48 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ఆవరణలో పూలు, పండ్ల, కూరగాయల మొక్కల పెంపకం చేపట్టారు. వీటి పోషక విలువలను టీచర్లు ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. ఇక్కడ పండించిన కూరగాయాలను మధ్యాహ్న భోజనానికి ఉపయోస్తున్నారు. టీచర్లు సొంత ఖర్చులతో ప్రత్యేకంగా రీడింగ్ కార్నర్ ఫ్లెక్సీలు ఇచ్చారు. ఇంట్లో అనుకూలంగా చదువుకునేందుకు అనువైన చోట ఏర్పాటు చేసుకునేలా తల్లి దండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో సంచాయక పొదుపు పథకం ఏర్పాటు చేసి ఆర్థిక క్రమశిక్షణ అలవాటు కల్పించారు. ఇప్పటి వరకు రూ.5 వేలు పొదుపు పథకంలో జమ చేసుకున్నారు. పాఠశాల ప్రహరీలకు రంగు రంగుల బొమ్మలు, ప్లాగ్‌లు ఏర్పాటు చేశారు.


ప్రహరీకి వేసిన రంగురంగుల బొమ్మలు, ప్లాగ్‌లు

మరాఠి నుంచి తెలుగుకు..

కెరమెరి: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని లేండిగూడ గ్రామంలో తెలుగు, మరాఠి మీడియం పాఠశాలలు ఉన్నాయి. అక్కడి మాతృభాష మరాఠి. మన పాఠశాలపై అంతగా శ్రద్ధ చూపరు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కాంత్రికుమార్ చేరడంతో బడి రూపురేఖలు మారాయి. 2022లో హెచ్‌ఎంగా ఉన సమయంలో30 మంది విద్యార్థులున్నారు. అందులో బడికి వచ్చేవారు 15 మంది. వారికి ప్రత్యేక బోధనపై దృష్టి సారించారు. ప్రధాన సబ్జెక్టుల్లో జీకేను ప్రవేశపెట్టారు. బీలివర్స్ అకాడమీ పేరుతో యూటూబ్ చానెల్‌కు తయారు చేసి టీఎల్‌ఎం ద్వారా బోధన చేస్తున్నారు. దీని వల్ల ఎస్‌సీఈఆర్టీ ద్వారా రాష్ట్రర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఇటీవల ఎఫ్‌ఎల్‌ఎన్ ఎక్స్‌ఎల్‌కి ఎంపికైంది. ఆయన చేసిన కృషితో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 47కు చేరింది. సాంస్కతిక కార్యక్రమాలతోపాటు ఉచిత గైడ్లు, ప్లేట్లు, గ్లాసులు, టై, బెల్టులు అందించారు.

క్లుప్తంగా

కాలువలో పడి బాలుడి మృతి


జయరాజ్ మృతదేహం

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ (12) ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..బుధవారం మధ్యాహ్నం తల్లి బత్తుల లతీకతో కలిసి తోటకు కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం అందరితో కలిసి భోజనం చేసిన తర్వాత పక్కనే ఉన్న కెనాల్‌లో ఆడుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో భారీ వర్షం పడడంతో ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయాడు. చాలాసేపటి తర్వాత గమనించిన తల్లి, గ్రామస్తులు జయరాజు కోసం వెతకగా కాలువలో ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్సై, సిబ్బంది కాలువలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. జయరాజ్ తండ్రి గత కరోనాలో మృతిచెందగా, తల్లి కూలీ చేసుకుంటూ బతుకుతోంది. కాగా జయరాజుకు మానసిక స్థితి సరిగాలేదని, ఇంట్లోనే ఉంటాడని రూరల్ ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(35) ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాల శివారు గోదావరి బ్రిడ్జి సమీపంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం అందింది. ఈ మేరకు ఘటనస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై నీలిరంగు టీషర్ట్, గోధుమ కలర్ చెప్పులు, నల్లటి గడ్డం, కుడి చేతికి రబ్బరు కడియం ధరించి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చూరీ గదిలో భద్రపర్చినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 9849058691 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తలమడుగు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన ఎల్పుల లక్ష్మయ్య (47) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. వచ్చిన డబ్బులు మద్యం తాగేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంటిలేషన్ మెరుగుపర్చాలి


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గనిలోని 21 లెవెల్, 5 సీమ్‌లో వెంటిలేషన్ మెరుగుపర్చాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 5 గనిని సందర్శించి కార్మికుల కలిసి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్ల ఇటీవల రాత్రి షిఫ్టులో ఒక కార్మికుడు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరాడని తెలిపారు. బ్యాంక్ హెడ్‌పై ఉన్న రేకులు పగిలిపోయి వర్షపు నీరు చేరడంతో ఆ ప్రాంగణమంతా బురదమయంగా మారిందన్నారు. దీంతో టబ్బులు నడిపేటప్పుడు కార్మికులు జారి పడుతున్నారని తెలిపారు. గనిలో ట్రాక్‌లైన్ క్లీనింగ్ మెయింటెనెన్స్ జరుగకపోవడంతో తరచూ టబ్బులు పడిపోతున్నాయన్నారు. అధికారులకు బొగ్గు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదన్నారు. ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, తిరుపతి రాజు, పేరం రమేశ్, జీవన్ జోయల్, మల్లారెడ్డి శ్రీనివాస్, పిట్ కార్యదర్శి నంబయ్య, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మోత రవి నాయకులు రాజేందర్, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇద్దరిని కాపాడి..వాగులో గల్లంతైన ఒకరు

- మల్లెంగిలో విషాదం


గల్లంతై మృతి చెందిన జాడే శంకర్


ప్రాణాలతో బయట పడిన జాదవ్ మిట్టు

నార్నూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలు జనజీవనం అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో మండలంలోని మల్లెంగి వాగు పొంగింది. అదే గ్రామానికి చెందిన మొత్తం 9 మంది రైతులు వ్యవసాయ పనుల కోసం వాగు అవతల ఒడ్డుకు ఉదయం చేరుకున్నారు. దినమంత పనిచేసి సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇంటికి వెళ్లేందుకు బయల్దేరారు. గ్రామ సమీపంలోని వాగులో నీటి ప్రవాహం తక్కువ ఉండడంతో జాడే శంకర్ (42)తోపాటు, మరో ఇద్దరు రైతులు జాదవ్ మిట్టు, జాదవ్ మిథున్‌లతో కలిసి వాగు దాటే సాహసం చేశారు. అప్పటికే వాగులో భారీగా వరద నీరు ఒకే సారి రావడంతో ఉధృతి పెరిగింది. పరిస్థితిని గమనించిన శంకర్ ఇద్దరు రైతులను ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. ఆయన బయటి వచ్చే క్రమంలో వరద ఉధృతికి గల్లంతయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో మృతదేహం కిలోమీటరు దూరంలో వాగులో లభించిందని ఎస్సై అఖిల్ తెలిపారు. మృతుడికి భార్య జాడే సరిత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చంటిబిడ్డతో వాగు దాటి ఆస్పత్రికి


చంటిబిడ్డతో వాగు దాటుతున్న ఈశ్వరిబాయి


కాలినడకన వెళ్తున్న ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ గ్రామానికి చెందిన పెందోర్ ఈశ్వరి ఐదు నెలల బాలింత చంటిబిడ్డతో ఎత్తుకుని వాగు దాటి ఆస్పత్రికి తీసుకెళ్లింది. పెందోర్ ఈశ్వరిబాయి చంటిబిడ్డకి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. భారీ వర్షం కారణంగా వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లలేకపోయింది. గురువారం వాగులో వరదనీరు కొంత తగ్గడంతో తల్లి ఆర్క గంగుబాయితో కలిసి సంకలో చంటి పాపను ఎత్తుకుని ప్రాణాలను తెగించి వాగు దాటింది. అక్కడి నుంచి కాలినడన ఆంధ్‌మామిడిగూడ వరకు వచ్చి ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం అందించారు. వాగు వద్ద బ్రిడ్జి లేక ప్రతిఏటా వర్షాకాలంలో అత్యవసర సమయంలో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు దృష్టిసారించి మంజూరైన నిధులతో మామిడిగూడ వాగు వద్ద బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న పలువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా వైన్స్, బెల్టుషాపులు మూసివేయాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలువురు అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతూ పట్టుబట్టారు. పక్కా సమాచారంతో గురువారం దాడి చేసిన మావల పోలీసులు పలు బీరు సీసాలను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. దస్నాపూర్‌లో 37, మావలలో 35 లిక్కర్ బాటిళ్లు, బాలాజీనగర్‌లో 14 బీరు బాటిళ్లు, కేఆర్కే కాలనీలో 4 బీర్ బాటిళ్లు, 2 క్వార్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు సమష్టి కృషి


మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిరూరల్: ఏరియాలో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనకు ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు సమష్టిగా కృషి చేద్దామని జీఎం రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఏరియాలోని కేకే–5 గనిని సందర్శించి గణపతి మండపం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందమర్రి ఏరియాతో తనకు 8 ఏళ్ల అనుబంధం ఉందని, వివిధ హోదాల్లో ఇక్కడ విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్కే ఓ సీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం గని ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్, అధికారులతో కలిసి గనిలోకి దిగి పని ప్రదేశాలను పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురికి జైలు

కాగజ్‌నగర్‌రూరల్: గంజాయి కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వి రమేశ్ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2021 ఏప్రిల్ 25న పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా అంబేద్కర్ కాలనీకి చెందిన జాడి శ్రీకర్ అలియాస్ శ్రీకాంత్ వద్ద గంజాయి లభించింది. మండలంలోని కోసిని వద్ద గల సాయి కిశోర్ తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని లాభార్జన కోసం ఇతరులకు అమ్ముతున్నట్లు శ్రీకర్ చెప్పాడు. అప్పటి ఎస్సై ఎండీ తహసీనొద్దీన్.. సాయికిశోర్ ఇంట్లో తనిఖీ చేసి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాడు. అతని విచారించగా సిర్పూర్(టి) మండలం కొలాంగూడకు చెందిన ఆత్రం భీం వద్ద గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు అంగీకరించాడు. అతని ఇచ్చిన సమాచారంతో ఆత్రం భీం ఇంట్లో తనిఖీ చేపట్టగా 1.2 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఆత్రం భీం చేనులో పత్తి, కంది మధ్యలో గంజాయిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అప్పటి ఎస్సై వెంకటేశ్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మోహన్ విచారణ జరిపారు. పట్టణ సీఐ ప్రేం కుమార్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా పీపీ జగన్మోహన్ వాదనలు వినిపించి నేరం రుజువు చేశారు. గంజాయి సరఫరా చేసిన జాడి శ్రీకర్, సాయికిశోర్‌లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా, గంజాయి సాగు చేసిన ఆత్రం భీంకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీ జగన్మోహన్‌రావు, ఇన్‌చార్జి ఏఎస్పీ చిత్తరంజన్, పట్టణ సీఐ ప్రేంకుమార్, ఆసిఫాబాద్ డివిజన్ కోర్టు లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్‌ను ఎస్పీ అభినందించారు.

6న గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం


మాట్లాడుతున్న గోడం గణేశ్

ఉట్నూర్‌రూరల్: ఈనెల 6న గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సమావేశం ఉట్నూర్‌లోని మత్తడిగూడ రాయిసెంటర్ భవనంలో నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్ తెలిపారు. ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడా, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్నిరోజుల క్రితం నోటీసులు జారీ చేసిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఆదివాసీ 9 తెగల గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడీలు, గ్రామపటేల్, దేవరీలు, కుల సంఘాలు, ఆదివాసీ సంఘాల నాయకులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ నాయకులు, తాజా మాజీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉద్యోగ సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపు రావ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి, ఆత్రం తిరుపతి, మాజీ జిల్లా అధ్యక్షుడు, ఆడ హనుమంత్ రావు గోండ్వాన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, సిడం సోనేరావు పటేల్ మెస్రం నాగ్నాథ్, ఇంద్రవెల్లి మండలం తుడుందెబ్బ మాజీ అధ్యక్షుడు మాధవి యశోద, మోతీరాం, మత్తడిగూడ మాజీ సర్పంచ్, ఆదివాసీ నాయకులు కుమ్ర వినాయక్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు

శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీలో పలువురికి చోటు కల్పిస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య గురువారం తెలిపారు. కేంద్ర కార్యదర్శులుగా జి.సత్యనారాయణ, మీసా కొమురయ్య, ఏ.అనిల్, ఉపాధ్యక్షులుగా బోనాల శ్రీనివాస్, దుర్గం లక్ష్మణ్, పులి రాజిరెడ్డి, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కొల్లూరి శ్రీను, అశోక్ రెడ్డి, పంబల రాములును నియమించారు. వీరి నియామకం పట్ల శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

బ్రిడ్జి తెగింది.. ప్రయాణం ఆగింది



ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని హరిఓం నగర్‌లో బ్రిడ్జి కొట్టుకుపోగా రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాహనదారులు బయటకు రాలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతు చేపట్టి రాకపోకలు జరిగేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్